

# రైతులకు తీరని..
# యూరియా కష్టాలు

★ రోడ్డెక్కి నిరసన తెలియజేస్తున్న రైతులు

**ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త)**

మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెనలో సోమవారం యూరియా కోసం రైతన్నలు రోడ్డెక్కారు. రాష్ట్ర కార్మిక ఉపాధి, గనులశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో యురియా కొరకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఉదయం పలుగ్రామాలకు చెందిన మహిళా రైతులు పట్టణంలోని క్యాంప్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. చెన్నూరు, కోటపెల్లి మండలాల రైతుల సాగుకు సరిపడ యురియాను ప్రభుత్వం అందివ్వక పోవడంతో గత 20 రోజులుగా రైతులు చెన్నూరు కేంద్రానికి చేరుకొని రోడ్డెక్కి వివిధ రకాలుగా నిరసన గళం విప్పిన మంత్రి నుంచి ఎలాంటి స్పందన లేదని రైతులు వాపోతున్నారు. యూరియా పంపిణీ చేయాలని కోరుతూ సోమవారం క్యాంప్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసేందుకు వచ్చిన రైతులను పోలీసులు సముదయించారు.ఆ సమయంలోనే ఎదో గ్రామానికి తరలించేందుకు యూరియా లోడ్‌తో వచ్చిన లారీ తరసపడడంతో రైతులు లారీ అడ్డుకొన్నారు, గత కొద్ది రోజులుగా తమ వ్యవసాయ పనులను మిగతా 2లో..






ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 9, సెప్టెంబర్ 2025




# విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయుడే మార్గదర్శి

● మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నస్పూర్, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త**


విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించి మంచి భవిష్యత్తును రూపొందించడంలో ఉపాధ్యాయుడు మార్గదర్శిగా పని చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్యలతో కలిసి ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి సర్వే పల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడంలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకమైనదని అన్నారు. ప్రతి మనిషి జీవితంలో ప్రశాంత జీవనం గడిపేందుకు స్థిరాస్తి, ఆర్థిక స్తోమత ఉపయోగ పడుతుందని, ఇవేమీ లేకుండా ఉన్నత విద్య కలిగి ఉంటే అన్నింటిని సంపాదించుకోవచ్చని, మిగతా 2లో..

# కేంద్ర ప్రభుత్వం పథకాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

✻ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త)**

తపాలా శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ కొట్టే శ్రీనివాస్‌లతో కలిసి పోస్టల్ శాఖ సేవలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర మిగతా 2లో..



# సమాజంలో విద్య ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికి వివరించాలి

✻ ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్,

ఇంఛార్జ్ జిల్లా విద్యాధికారి దీపక్ తివారి



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

సమాజంలో విద్య ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికి వివరించి విద్య అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇంచార్జ్ జిల్లా విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా మిగతా 2లో..

# నిర్దేశిత లక్ష్య సాధనకు ఉద్యోగులు, అధికారులు కృషి చేయాలి

● రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకత సాధించాలి

● శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్

**నస్పూర్, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త**

2025-ఖ26 ఆర్థిక సంవత్సరానికిగాను ఐకె1ఏ గని 2.4 లక్షల టన్నుల నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడానికి ఉద్యోగులు, అధికారులు కృషి చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఐకె1ఏ భూగర్భ గని అధికారులు, సూపర్వైజర్‌లతో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ జనరల్ మిగతా 2లో..





## సింగరేణి ఉద్యోగులకు 40 శాతం లాభాల వాటా చెల్లించాలి

### - టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. మణిరాం సింగ్

**నస్పూర్, సెప్టెంబర్ 08, ప్రభాత వార్త**

గత ఆర్థిక సంవత్సరం సింగరేణి సంస్థకు వచ్చిన నికర లాభాలను ప్రకటించి, ఉద్యోగులకు 40 శాతం లాభాల వాటా చెల్లించాలని టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. మణిరాం సింగ్ అన్నారు. సోమవారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ, కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తామని, కోల్ ఇండియా మాదిరిగా సింగరేణిలో కూడా అక్టోబర్ 3న దసరా సెలవు ప్రకటించాలని, సంస్థ లాభాల్లో కాంట్రాక్టు కార్మికులకు 20 వేల రూపాయల చొప్పున చెల్లించాలని, ఖాళీగా ఉన్న కంపెనీ క్వార్టర్లు రిటైర్డ్ కార్మికులకు కేటాయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తలారి రాజు, గరిగంటి రాజయ్య, గైని తిరుపతి, కందుల శ్రీనివాస్, ఎండి సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మిలాద్ ఉన్ నబీ

**వాంకిడి, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రధాన వీధుల గుండా ముస్లింలు సోదరులు భక్తిశ్రద్ధలతో శాంతి ర్యాలీ (జులుస్) నిర్వహించారు. ముస్లిం మైనార్టీ కమిటీ వాంకిడి మండల అధ్యక్షుడు షేక్ హమీద్ చేతుల మీదుగా ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా మిలాద్ ఉన్ నబీ పండుగను ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా జరుపుకుంటాన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ సర్వ మానవ సమానత్వం, శాంతి, స్థాపనే లక్ష్యంగా సాగిన మహమ్మద్ ప్రవక్త బోధనలతో స్ఫూర్తి పొందాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు, ముస్లిం సోదరులు, యువకులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు.

## ఉచిత కంటి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**కాగజ్ నగర్, సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త)**

కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి శ్రీ కొత్తపల్లి వెంకట లక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటి అండగా నిలుస్తోందని సొసైటి ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు వినియోగించు కోవాలని సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, డాక్టర్ కొత్తపల్లి అనిత సూచించారు. ప్రతీ మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఆపరేషన్లకు ఎంపికైన 10 మందికి బెల్లంపల్లి లయన్స్ కంటి ఆసుపత్రికి క్యాటరాక్ట్ ఆపరేషన్ల నిమిత్తం పంపించామని వారు తెలిపారు. రోగులకు రవాణా, భోజన సదుపాయాలు కల్పించిన అనంతరం డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ వారితో మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా తమ సొసైటి ద్వారా వేల మందికి ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ అవకాశం ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, లబ్ధిపొందిన వారు మరికొందరిని ప్రోత్సహిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య శిబిరం ఇంచార్జి గోపి, కీమ్స్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# రైతులకు తీరని యూరియా కష్టాలు

(మొదటిపేజీ తరువాయి)

పక్కన పెట్టి యూరియ కొరకు వ్యవసాయ కేంద్రం ముందు పడిగాపులు కాస్తుంటే కొంతమంది రాజకీయ పలుకుబడి గల నాయకులు అధికారుల పై ఒత్తిడి చేసి స్వప్రయోజనం పొందుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మంత్రి వివేక్ నియోజక వర్గ రైతుల సాగుకు సరిపడా యురియా పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. రెబ్బెన మండల కేంద్రంలోని సహకార సంఘం వద్ద సోమవారం వందలది మంది రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. యూరియా స్టాక్ ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వల్ల పంపిణీలో జాప్యం చేస్తున్నారని రైతులకు తీవ్ర ఇబ్బందులకి గురి చేస్తున్నారని టోకెన్లు ఇచ్చి నెల రోజులు అవుతున్నా యూరియా మాత్రం ఇవ్వడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము రోజు కూలీ పోగొట్టుకుని కైకిలి పోయే సన్నకారు రైతులమని, యూరియా లేక పంట ఎండిపోతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు వెంటనే యూరియా ఇవ్వాలని రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సుమారు గంట పాటు జరిగిన రాస్తారోకోలో భాగంగా భారీగా ట్రాఫిక్ ఏర్పడింది. ధర్నా స్థలానికి చేరిన రెబ్బెన సిఐ సందీప్ ఉన్నత అధికారులతో మాట్లాడి రైతులకి యూరియా పంపిణి వెంటనే చేపట్టాలని సీఐ హామీతో రైతులు ధర్నాను విరమింప చేశారు.

## కేంద్ర ప్రభుత్వం పథకాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ పథకాల సేవలను తపాలా శాఖ కార్యాలయాల ద్వారా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల సేవలను పొందే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని, తపాలా కార్యాలయాలలో పొదుపు ఖాతాలు తెరవడం, ప్రధానమంత్రి కిసాన్, గ్యాస్ రాయితీ, అన్ని రకాల బిల్లు చెల్లింపులు చేయవచ్చని, అన్ని రకాల ప్రభుత్వ పథకాల లబ్ది పొందవచ్చని తెలిపారు. అనేక రకాల జీవిత బీమా అవకాశం కల్పించిందని, సంవత్సరానికి 565 రూపాయల ప్రీమియం చెల్లిస్తే 10 లక్షల రూపాయల వ్యక్తిగత ప్రమాద బీమా, 345 రూపాయలు చెల్లిస్తే 5 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం తపాలా శాఖ కల్పిస్తుందని తెలిపారు. జిల్లాలోని అన్ని తపాలా శాఖ కార్యాలయాలను ఈ సేవలు లభిస్తాయని, ప్రజల సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తపాలా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ బదిలీ

### ఘనంగా వీడ్కోలు సమావేశం

**వేమనపల్లి, సెప్టెంబర్ 8 (ప్రభాతవార్త)**



విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేసి మన్ననలు పొంది సాధారణ బదిలీపై సిరిసిల్ల జిల్లాకు వెళ్తున్న నీల్వాయి టీజీబీ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ దొండి గంగా సాగర్‌ని సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ మేరకు సోమవారం నీల్వాయి టీజీబీ బ్యాంకులో బ్యాంక్ మేనేజర్ శివ శంకర్ ఆధ్వర్యంలో వీడుకోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బ్యాంకు పరిధిలోని సిబ్బంది సీసీలు, గ్రామైక్య సంఘం లీడర్లు పాల్గొని శాలువలు పూలమాలలతో సత్కరించి వీడుకోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఫీల్డ్ ఆఫీసర్ విధినిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేస్తూ బ్యాంకుకు వచ్చే ఖాతాదారుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేవాడని పేర్కొన్నారు. మహిళా సంఘాల అభివృద్ధికి రుణాలన్నించి ఎంతగానో తోడ్పడ్డారని, పంట రుణాలను రైతులకు సకాలంలో అందజేసి రైతుల పక్షపాతిగా పేరు పొందారాని కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్యాషియర్ సందీప్ ఎకౌంట్ సురేష్, సీసీలు, వివోఏలు, బ్యాంకు సిబ్బంది, బ్యాంకు మిత్ర పాల్గొన్నారు.

## సమాజంలో విద్య ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికి వివరించాలి

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయాల భవన సముదాయం నుంచి ర్యాలీని ప్రారంభించి జిల్లా కేంద్రంలోని కొమరం భీం చౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా మార్కెట్ నుంచి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇంచార్జ్ జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ సమాజంలో ఐక్యత, సామాజిక బాధ్యత, విద్య ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికి వివరించాలని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధి కోసం అనేక చర్యలు చేపడుతుందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని సాధించే దిశగా ఏకాగ్రతతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి అటక మధుకర్, కామన్ బోర్డు పరీక్షల కార్యదర్శి హనుమంతు, పర్యవేక్షకులు శ్రీనివాస్, మెప్మా అధికారి మోతిరాం, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఏపీఎం రమేష్, ఫిజికల్ డైరెక్టర్లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నిర్దేశిత లక్ష్య సాధనకు ఉద్యోగులు, అధికారులు కృషి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

మేనేజర్ మాట్లాడుతూ, భూగర్భ గనులను కాపాడుకోవడానికి, భూగర్భ గనుల జీవితకాలం పెంచడానికి ప్రతి ఒక్క ఉద్యోగి, అధికారి కృషి చేయాలని అన్నారు. గనిలో హాజరు శాతాన్ని పెంచాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాతకత సాధించడానికి కృషి చేయాలని, ప్రతి ఒక్క సూపర్వైజర్ తన వద్ద పనిచేస్తున్న ఉద్యోగులకు దిశా నిర్దేశం చేస్తూ, బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకత పెంపుదలకు కృషి చేయాలని, పని గంటలను సద్వినియోగం చేసుకోవాలని, భూగర్భ గనిలో యంత్రాలను సక్రమంగా ఉపయోగించుకోవాలని సూచించారు. గనికి కావలసిన రైల్స్, టబ్బులను, మెస్లను తదితర మెటీరియల్, నూతన హాలర్ యంత్రాన్ని, మ్యాన్ రైడింగ్ సిస్టం ఏర్పాటు చేయడం జరుగుతుందని, దీనిని ప్రతి ఒక్క ఉద్యోగి ఉపయోగించుకొని నిర్దేశిత లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ. వెంకటేశ్వర రెడ్డి, ఐకె 1ఏ గని మేనేజర్లు నాగన్న, కోటయ్య, ప్రాజెక్ట్ ఇంజనీర్ రామకృష్ణారావు, పిట్ ఇంజనీర్ మల్లేష్, గని రక్షణాధికారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయుడే మార్గదర్శి

(మొదటిపేజీ తరువాయి)

ప్రశాంతంగా జీవించవచ్చని తెలిపారు. తెలంగాణ ఉపాధి కల్పనకు ప్రాధాన్యత అందించే రాష్ట్రమని, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా వృత్తి విద్యలలో నైపుణ్యతను అందించి ఆర్థికంగా స్థిరపడేందుకు తోడ్పాటు అందించడం జరుగుతుందని తెలిపారు. 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో దేశంలోనే ముందంజలో ఉండే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, కఠోర శ్రమ, క్రమశిక్షణ, ఏకాగ్రతతో పని చేయడం ద్వారా ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చు అని తెలిపారు. ప్రస్తుత విద్యా విధానంలో మరిన్ని మార్పులు తీసుకువచ్చి అధునాతన సాంకేతికత వైపుగా విద్యార్థులను ముందుకు తీసుకువెళ్లే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు తమ వృత్తిలో 30 నుండి 35 సంవత్సరాలు విధులు నిర్వహిస్తూ ఒక పూర్తి తరాన్ని చూస్తారని, పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు తల్లిదండ్రుల స్థానంలో వ్యవహరించి వారి భవిష్యత్తుకు కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులు నేర్చుకునే విద్య సక్రమంగా ఉన్నట్లయితే సమాజం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని, ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించినట్లయితే వారి ఎదుగుదలతో ప్రభుత్వ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని తెలిపారు. విద్యార్థులకు సకల సౌకర్యాలతో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర సదుపాయా లు కల్పించడంతో పాటు మధ్యాహ్న భోజనంలో పోషక విలువలు కలిగిన మెనూ అమలు చేస్తూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తుందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో ఈ విద్యా సంవత్సరం దాదాపు 6 వేల మంది విద్యార్థులు అదనంగా చేరారని, బడిబాట కార్యక్రమం నిర్వహించడం ద్వారా బడి మాని వేసిన పిల్లలు, బడి బయటి పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకో వడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ముఖ గుర్తింపుతో హాజరు తీసుకోవడంతో ఉపాధ్యాయు ల సమయపాలన, విద్యార్థుల హాజరు సక్రమంగా జరుగుతుందని తెలిపారు. అనంతరం రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించి, జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన 71 మంది ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## 10న ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు

**- మంచిర్యాల జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ. పురుషోత్తం**

**నస్పూర్, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త**

జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఈ నెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ. పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సంఘాల ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

## సింగరేణిలో దసరా పండుగ తేదీ మార్పు కోరుతున్న హెచ్‌ఎమ్ఎస్ యూనియన్

**రెబ్బెన, సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త)**

బెల్లంపల్లి ఏరియాలోని అన్ని డిపార్ట్‌మెంట్లు, ఓసీపీల్లో పనిచేస్తున్న కార్మికుల కోసం, దసరా పండుగ తేదీ మార్పును కోరుతూ హెచ్ఎమ్ఎస్ యూనియన్ వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ పతెం రాజబాబు ఒక ప్రకటనలో పేర్కొంటూ అక్టోబర్ 2న గాంధీ జయంతి, దసరా పండుగ ఒకే రోజు రావడంతో కార్మికులకు ఒక పండుగ సెలవు నష్టమవుతుందని తెలిపారు. వెస్టన్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్ (డబ్ల్యూసిఎల్) సంస్థలో దసరా తేదీకి మార్పు చేసినట్లు సూచిస్తూ, అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలోని సింగరేణి సంస్థ కూడా తక్షణమే సర్క్యులర్ విడుదల చేసి, పండుగను మరొక రోజున జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎమ్ఎస్ యూనియన్ యాజమాన్యాన్ని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సంస్కృుృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ కార్మికుల పి.హెచ్.డి (పెయిడ్ హాలిడే) హక్కులు కాపాడే విధంగా యాజమాన్యం స్పందించాలని హెచ్ఎమ్ఎస్ యూనియన్ పిలుపునిచ్చింది.

## ప్రతి ఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నవభారత సాక్షరత కార్యక్రమం

**- జిల్లా వయోజన విద్యాధికారి ఎ.పురుషోత్తం నాయక్**

**నస్పూర్, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త**

జిల్లాలోని ప్రతి ఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష ్యంగా నవభారత సాక్షరతా కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా వయోజన విద్యాధికారి ఎ. పురుషోత్తం నాయక్ అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలో గల ప్రధానమంత్రి శ్రీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వయోజన విద్యాధికారి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించి అక్షరాస్యులుగా మారేందుకు నవభారత సాక్షరత కార్యక్రమం ద్వారా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని 31 వేల 435 మంది నిరక్షరాస్యులను, 3 వేల 13 మంది వాలంటీర్లను ఉల్లాస్ యాప్ లో నమోదు చేసి, వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. త్వరలోనే గ్రామాలలో అక్షర కేంద్రాల ద్వారా వయోజనులకు చదువు నేర్పించడం జరుగుతుందని, రానున్న 2 సంవత్సరాలలో మంచిర్యాలను 100 శాతం అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. అనంతరం అక్షరాస్యతపై విద్యార్థులకు నిర్వహించిన ఉపన్యాస, వ్యాసరచన పోటీలు, సెర్ప్ సిబ్బందికి నిర్వహించిన ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్, మండల విద్యాధికారి దత్తు మూర్తి, మోడల్ స్కూల్ ఇన్చార్జి ప్రిన్సిపల్ పెద్దన్న, లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షులు సుదర్శన్, శ్రీనివాస్, ఎ.పి.ఎం., డి.పి.ఎం. లు శాంకరి, జనార్ధన్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా వయోజన విద్యాధికారి ఎ.పురుషోత్తం నాయక్

# ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. తెలంగాణ ఎరుకల ప్రజా సమితి జిల్లా అధ్యక్షుడు ఉంద్రాల ఎల్లయ్య తన దరఖాస్తులో జిల్లాలో ఎస్.సి., ఎస్.టి. మానిటరింగ్ కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. మంచిర్యాల పట్టణానికి చెందిన చకినారపు సావిత్రి తాను నర్సింగ్ శిక్షణ పూర్తి చేసుకుని కులాంతర వివాహం చేసుకున్నానని, కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నానని, చెన్నూరు పట్టణంలోని శిశు మందిర్ వాడలో గల అంగన్వాడిలో అవకాశం ఉన్నందున తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. చెన్నూరు మండలం వెంకంపేట గ్రామానికి చెందిన బి. సమ్మయ్య తన కూతురుకు రెబ్బెన గురుకులంలో సీటు వచ్చిందని, నిరుపేద కుటుంబం అయిన తమకు ఆర్థిక స్తోమత లేనందున మంచిర్యాల జిల్లాకు బదిలీ చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణం హనుమాన్ బస్తీకి చెందిన ఎంజాల కుమార్ మండలంలోని తాళ్ల గురుజాల శివారులో గల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం మురిమడుగు గ్రామానికి చెందిన సంధ్య వేణి నడిపి రాజం తాను కొనుగోలు చేసిన పట్టా భూమి ఆన్‌లైన్‌లో నిషేధిత భూమి జాబితాలో చూపిస్తుందని, తొలగించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని సూర్య నగర్‌కు చెందిన ఆసంపల్లి చంద్రకళ తాను తన భర్త ఇద్దరు దివ్యాంగులమని, ఎలాంటి ఉపాధి ఆధారము లేదని, నిరుపేద అయిన తమకు రెండు పడక గదుల ఇండ్లలో అవకాశం కల్పించి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆధ్వర్యంలో హెచ్.ఐ.వి. ఎయిడ్స్ పై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన రెడ్ మిషన్ క్విజ్ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## ఎన్‌సిడి ప్రోగ్రాంలో ఆన్లైన్ పని నుంచి ఏఎన్ఎంలకు విముక్తి కల్పించాలి

**- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ డిమాండ్**

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త)**

ఎన్‌సిడి (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) ప్రోగ్రాంలో ఆన్లైన్ పనిలో నుండి ఏఎన్ఎంలను విముక్తి కలిగించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగి ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ, గత దశాబ్దకాలంగా ఏఎన్ఎంలు ఎన్సీడి ప్రోగ్రాంలో స్క్రీనింగ్ టెస్టులు, రిపోర్టుల తయారీ వంటి పనులను ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తున్నారని తెలిపారు. అయితే ఇటీవల అధికారులు అదే పనిని ఆన్లైన్‌లో కూడా చేయాలని ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. నిజానికి ఆన్లైన్ పని ఏఎన్ఎంల బాధ్యత కాదని, ఇప్పటికే వారి వద్ద అనేక యాప్‌లు, ఫీల్డ్ వర్క్ వలన తీవ్రంగా ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. రోజు పది నుంచి పదిమూడు గంటల పాటు పనిచేస్తూ, బీపీ, షుగర్, స్పాండిలైటిస్ వంటి ఆరోగ్య సమస్యలకు లోనవుతున్నాం. మానసిక ఒత్తిడి పెరిగిపోతోంది. కనుక మమ్మల్ని ఆన్లైన్ పనిలో నుండి విముక్తి కల్పించి, మిగతా ఉద్యోగుల ద్వారా ఆ పని చేయించాలని కోరుతున్నాం, అని అన్నారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, ఉపాధ్యక్షుడు చిరంజీవి, ఏఎన్ఎం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సంతోషి, ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, కోశాధికారి సునీత, ప్రచార కార్యదర్శి ప్రమీలతో పాటు పెద్ద సంఖ్యలో ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## 10వ తేదీన విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశం

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ పట్టణంలోని యూనిట్ విశ్రాంత ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం ఈ నెల 10వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు సంఘ భవనంలో నిర్వహించనున్నట్టు సంఘ అధ్యక్షుడు యం. జయదేవ అబ్రహాం, కార్యదర్శి యం. శివప్రసాద్ నాయర్ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తేదీన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో దివంగత సభ్యులకు సంతాపం, అధ్యక్ష పరిచయ ప్రసంగం, కార్యదర్శి నివేదిక, ఆర్థిక నివేదికలపై చర్చ మరియు ఆమోదం, ఇతర అంశాలపై చర్చ జరగనున్నది. గురుపూజా దినోత్సవం సందర్భంగా, గతంలో ఎప్పుడూ సన్మానం పొందని సీనియర్ విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించనున్నట్టు వారు తెలిపారు. జిల్లా శాఖ బాధ్యుల సందేశం, వందన సమర్పణ వంటి అంశాలు కూడా సమావేశంలో ఉంటాయని పేర్కొన్నారు. సంఘం సభ్యులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## వేమనపల్లి తహసీల్దార్‌గా పుష్పలత

**స్వాగతం పలికిన రెవిన్యూ సిబ్బంది**

**వేమనపల్లి, సెప్టెంబరు 8, (ప్రభాతవార్త)**

వేమనపల్లి తహసీల్దార్‌గా ఈ. పుష్పలత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన సంధ్యారాణి నిర్మల్ జిల్లాకు బదిలీ కాగా, ఆమె స్థానంలో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పనిచేసిన పుష్పలత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవిన్యూ సిబ్బంది తహసీల్దార్‌కి స్వాగతం పలికారు. వీరిలో నాయబ్ తహసీల్దారు సాయి కృష్ణ, ఆర్ఐ ఖాలిక్ రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.



స్వాగతం పలుకుతున్న దృశ్యం

# ఈవీఎం యంత్రాల భద్రతకు పటిష్ట చర్యలు

## - ఆసిఫాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**



ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఈవిఎంలను భద్రపరిచిన గోదామును త్రైమాసిక తనిఖీలలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాము సీలు తెరిచి గోదాములో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల బాక్సులను పరిశీలించడం జరిగిందని తెలిపారు. గోదాము వద్ద సి.సి. కెమెరాల ద్వారా 24 గంటలు పర్యవేక్షించడం జరుగుతుందని, పటిష్టమైన పోలీస్ భద్రత ఉందని, అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**



కాగజ్‌నగర్ మండల విద్యా వనరుల కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ఎంపీడీవో కోట ప్రసాద్, అధ్యక్షులుగా మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్ వ్యవహరించారు. ఈ వేడుకలలో మండలంలోని ఎనిమిది కాంప్లెక్స్‌ల గెస్టెడ్ ప్రధానోపాధ్యాయులు, ఇతర ప్రధానోపాధ్యాయులు, ప్రతి పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల కృషిని గుర్తిస్తూ, ప్రతి కాంప్లెక్స్ నుంచి ఒక ఉత్తమ ఉపాధ్యాయుని ఎంపిక చేసి, మొత్తం 9 ఉపాధ్యాయులు ,8 మంది కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, 1 కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్‌ను ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ప్రశంసా పత్రం, శాలువా, మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు సమాజ నిర్మాణకారులు, వారి సేవలతోనే దేశం భవిష్యత్తు నిర్మాణం సాధ్యమవుతుందనిఅన్నారు. అలాగే ఎంఈఓ వాసాల ప్రభాకర్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా జరుపుకునే ఉపాధ్యాయ దినోత్సవం ఉపాధ్యాయుల త్యాగాలు, సేవలను గుర్తు చేస్తుంది. విద్యార్థులను బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల ప్రధాన ధ్యేయం కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉపాధ్యాయ వృత్తి గొప్పదనాన్ని కొనియాడుతూ, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో చిలుకూరు సత్యనారాయణ, అనురాధ అబ్బాయి, శ్రీలత, వరలక్ష్మి, అమరేందర్ రెడ్డి, వెంకట్రాజయ్య , తాటి రవీందర్, పరస చంద్రశేఖర్, తపన్ రాయి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## ఈ నెల 10న ప్రాదేశిక ఓటర్లు, పోలింగ్ కేంద్రాల తుది జాబితా

### - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 10వ తేదీన ప్రాదేశిక ఓటర్లు, పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీ మ్నారాయణతో కలిసి అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ప్రాదేశిక ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా రూపొందించి ఈ నెల 10వ తేదీన తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 15 జెడ్.పి.టి.సి., 127 ఎం.పి.టి.సి. ప్రాదేశిక నియోజకవర్గం ఉన్నాయని, మొత్తం 3 లక్షల 53 వేల 895 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల కొరకు జిల్లాలో 708 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ 6వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శించడం జరిగిందని, ఈ జాబితాలపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి ఈ నెల 10వ తేదీన తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో కృషి చేసి స్పష్టమైన జాబితా రూపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలపై లైంగిక వేధింపుల నిరోధానికి కఠిన చర్యలు

### - ఆసిఫాబాద్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 8 (ప్రభాతవార్త):**

పని ప్రదేశాలలో, సమాజంలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధానికి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాంతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ, మహిళ ఉద్యోగులకు పని చేసే ప్రదేశాలలో ఎదురయ్యే లైంగిక వేధింపులను నిరోధించడం కొరకు పోష్ యాక్ట్ 2013 అమలు చేస్తూ గౌరవంగా పనిచేసుకునే వాతావరణాన్ని కల్పించడం జరుగుతుందని తెలిపారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, లైంగిక వేధింపులకు పాల్పడటం పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా ప్రభుత్వేతర సంస్థలలో పనిచేసే మహిళలందరికీ చట్టం వర్తిస్తుందని, ప్రతి సంస్థలు అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని, వేధింపులకు గురైన వారు కమిటీలో ఫిర్యాదు చేసుకునే హక్కు ఉంటుందని తెలిపారు. ప్రతి మహిళకు శారీరక, మానసిక ఆరోగ్యం అవసరమని, వేధింపులపై నిర్భయంగా ఫిర్యాదు చేయాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త శారద, డా. అనూష, రాణి, డిప్యూటీ డెమో మార్త, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## యూరియా పంపిణీ చేయాలని రోడ్డెక్కిన రైతన్నలు

### వ్యవసాయ సహకార సంఘం వద్ద ఉద్రిక్తత

**రెబ్బెన, సెప్టెంబర్ 08 (ప్రభాతవార్త)**

మండల కేంద్రంలోని సహకార సంఘం వద్ద సోమవారం వందలది మంది రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. యూరియా స్టాక్ ఉన్నప్పటికీ అధికారుల నిరక్ష్యం వల్ల పంపిణీలో జాప్యం చేస్తున్నారని రైతులకు తీవ్ర ఇబ్బందులకి గురి చేస్తున్నారని టోకెన్లు ఇచ్చి నెల రోజులు అవుతున్నా యూరియా మాత్రం ఇవ్వడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము రోజు కూలీ పోగొట్టుకుని కైకిలి పోయే సన్నకారు రైతులమని, యూరియా లేక పంట ఎండిపోతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు వెంటనే యూరియా ఇవ్వాలని రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సుమారు గంట పాటు జరిగిన రాస్తా రోకోలో భాగంగా భారీగా ట్రాఫిక్ ఏర్పడింది. ధర్న స్థలానికి చేరిన రెబ్బెన సిఐ సందీప్ ఉన్నత అధికారులతో మాట్లాడి రైతులకి యూరియా పంపిణి వెంటనే చేపట్టాలని సీఐ హామీతో రైతులు ధర్నాను విరమింప చేశారు.

## సంస్థ ప్రగతిలో ఉద్యోగులు భాగస్వాములు కావాలి

### - శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్

**నస్పూర్, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త**



ఉద్యోగులు రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకత సాధిస్తూ సంస్థ ప్రగతిలో ఉద్యోగులు భాగస్వాములు కావాలని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఎస్సార్పీ 3,3ఏ భూగర్భ గని అధికారులు, సూపర్వైజర్‌లతో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ జీఎం మాట్లాడుతూ, భూగర్భ గనులను కాపాడుకోవడానికి, భూగర్భ గనుల జీవితకాలం పెంచడానికి ప్రతి ఒక్క ఉద్యోగి, అధికారి కృషి చేయాలని, ఎస్సార్పీ 3,3ఏ భూగర్భ గని 2025-౼26 ఆర్థిక సంవత్సర నిర్దేశిత లక్ష్యం 3.4 లక్షల టన్నులు సాధించడానికి ఉద్యోగులు అధికారులు కృషి చేయాలని, పని గంటలను సద్వినియోగం చేసుకోవాలని భూగర్భ గనిలో యంత్రాలను సరైన విధంగా ఉపయోగించుకోవాలని సూచించారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన ఉద్యోగుల హాజరు శాతాన్ని పెంచడానికి కృషి చేయాలని, సంస్థ ప్రగతిలో భాగస్వాములు కావడానికి వారికి తగిన సూచనలు చేయాలని సూపర్వైజర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్పీ 1, 3 గ్రూప్ గనుల ఏజెంట్ జి. రవికుమార్, గని మేనేజర్ సిహెచ్ వెంకట్రావు, గని రక్షణాధికారి ఈ. మహేందర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సొంతింటి కల అభిప్రాయ ఓటింగ్‌లో పాల్గొనాలి

### - సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజా రెడ్డి

**నస్పూర్, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త**

సొంతింటి కల సాకారానికి నిర్వహిస్తున్న అభిప్రాయ ఓటింగ్ లో కార్మికులు పాల్గొనాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజా రెడ్డి తెలిపారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్.కె 5 గని పై జరిగిన గేట్ మీటింగ్‌లో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ, గత ఆర్థిక సంవత్సరం సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలు ప్రకటించి, కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న అన్ని జీఎం కార్యాలయాల ముందు నిర్వహించనున్న ధర్నా విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. ఈనెల 11, 12 తేదీల్లో సొంత ఇంటి పథకం పై సిఐటియు నిర్వహిస్తున్న అభిప్రాయ సేకరణలో భాగంగా నిర్వహిస్తున్న నమూనా బ్యాలెట్‌లో కార్మికులు యూనియన్‌లకు అతీతంగా అధిక సంఖ్యలో పాల్గొని యాజమాన్యానికి, ప్రభుత్వానికి సొంతింటి కల నెరవేర్చకపోతే దీర్ఘకాలిక పోరాటానికి సిద్ధమనే సూచనలు పంపించాలని తెలిపారు. దసరా దగ్గర పడుతున్న ఇంకా లాభాల వాటా ప్రకటన చేయకపోవడం గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు సిగ్గుచేటని అన్నారు. యాజమాన్యంపై గతంలో పోరాటాలు చేసిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ప్రస్తుతం వినతి పత్రాలకు పరిమితమయ్యారని, ఇప్పటికైనా అన్ని సంఘాలను కలుపుకొని యాజమాన్యంపై పోరాటం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షులు గుల్ల బాలాజీ, బ్రాంచ్ నాయకులు వెంగళ శ్రీనివాస్, పిట్ సెక్రటరీ చిగురు లక్ష్మణ్, బట్టు సురేందర్,ఇప్ప నరేష్, సిహెచ్ తిరుపతి, పోతు వెంకటేష్, నాయకులు పిట్ నాయకులు పాల్గొన్నారు.